క్లుప్తంగా

నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

జే.పంగులూరు: ముప్పవరం కల్చరల్ క్లబ్ 9వ వార్షికోత్సవం సందర్భంగా, అద్దంకి నియోజకవర్గ స్థాయిలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండో బహుమతి రూ. 20 వేలు, మూడో బహుమతి రూ. 10 వేలు, నాల్గో బహుమతి రూ. 5 వేలు ఉంటాయని తెలిపారు. సంక్రాతి పండుగ సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి రోజు స్త్రీలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 96667 77529, 93981 30066 సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటాం



ఆర్థిక సాయం అందిస్తున్న కరణం వెంకటేష్

చీరాల: అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన బాధితులు అధైర్యపడొద్దని అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ హామీ ఇచ్చారు. మండలంలోని దేవాంగపురి పంచాయతీకి చెందిన పృథ్వీ మోహనరావు, పృథ్వీ వెంకటేశ్వర్లు నివాస గృహాలు అగ్ని ప్రమాదానికి శుక్రవారం ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న వెంకటేష్ శనివారం బాధితులను పరామర్శించి ఆదుకుంటామని భరోసా కల్పించారు. తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున రూ.20 వేలను అందించారు. కార్యక్రమంలో పి.ధనుంజయ, అంకాలరెడ్డి, శ్రీధర్, హనుమంతరావు, తదితర నాయకులు ఉన్నారు.

11 నుంచి త్యాగరాజ స్వామి ఆరాధన

చీరాల అర్బన్: చైతన్య భారతి చీరాల ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి ఐదు రోజులు పాటు సంగీత సద్గురు త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలను ముంతావారి సెంటర్‌లోని ఎన్వీఎస్ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు చైతన్య భారతి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పోలవరపు వెంకటేశ్వరప్రసాద్, భాగి నారాయణశాస్త్రిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీన త్యాగరాజ స్వామి చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు రాత్రి గాత్ర కచ్చేరి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గత రెండేళ్లుగా కోవిడ్ కారణంగా ఆన్‌లైన్‌లో గాత్రకచ్చేరిలను నిర్వహించామని, ఈ ఏడాది కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన నూతి రామకృష్ణ, మాజీ సర్పంచ్ చెన్నుపాటి ఆంజనేయులు, ధూళిపాళ్ల శ్రీనివాసరావు, మానం వెంకటేశ్వరరావు, కేదానారావుతోపాటు మరో 40 కుటుంబాలు శనివారం రాత్రి టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బీసీహెచ్ గరటయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

డ్రాగన్ పండు.. ఆదాయం మెండు



● లాభాల బాటలో డ్రాగన్ ఫ్రూట్ సాగు ● క్రమంగా జిల్లాలో విస్తరిస్తున్న డ్రాగన్ ఫ్రూట్

● ఒక్కసారి నాటితే 30 ఏళ్ల వరకు దిగుబడి ● సాగుకు ప్రభుత్వం చేయూత

మేదరమెట్ల: వ్యవసాయం రంగంలో రైతు కొత్త తరహా పంటల సాగుచేయడానికి మొగ్గు చూపుతున్నాడు. ఇటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కొత్తగా ఆలోచిస్తున్నాడు రైతన్న. అందులో భాగంగానే జిల్లాలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు క్రమంగా పెరుగుతోంది. మొదట్లో పంటను సాగు చేసేందుకు అంతగా మొగ్గుచూపని రైతులు ప్రస్తుతం పంట దిగుబడి బాగుండటంతో సాగుచేయడం మొదలు పెట్టారు.

మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్‌కు మంచి డిమాండ్ ఉంది. జిల్లాలో అత్యధికంగా కొరిశపాడు మండలంతో పాటు వేటపాలెం, మార్టూరు మండలాల్లో అత్యధికంగా సాగు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 30 ఎకరాల వరకు సాగు చేపట్టారు. ప్రభుత్వం సబ్సిడీ ప్రకటించడంతో ఈ ఏడాది మరో యాభై ఎకరాల్లో ఈ పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని ఉద్యాన వనశాఖ అధికారులు చెపుతున్నారు.

సాగు విధానం..

ఈ పంట సాగుకు ఎకరాకు 450 వరకు సిమెంట్ స్తంభాలు అవసరం. ఒక్కో స్తంభానికి నాలుగు అంట్లు చొప్పున నాటుకోవాల్సి ఉంటుంది. అంట్లు నాటిన ఎనిమిది మాసాల తరువాత కాపు రావడం మొదలౌతుంది. ఒకసారి నాటుకున్న అంటు సుమారు 30 ఏళ్లపాటు ఆదాయాన్ని ఇస్తుంది. మొదటిసారి మాత్రమే ఎకరాకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. తరువాత ఏడాది నుంచి నామమాత్రపు ఖర్చుతో పంట చేతికి అందుతుంది.

లాభదాయకమైన పంట..

డ్రాగన్ ఫ్రూట్ మొక్క అన్ని నేలల్లో ఏపుగా పెరుగుతుంది. ఈ మొక్క ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది టన్నుల వరకు దిగుబడిని ఇస్తుంది. మార్కెట్‌లో ఈ పండు ధర టన్ను రూ.1.25 నుంచి 1.50 లక్షల వరకు పలుకుతోంది. రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.200 నుంచి రూ.250 వరకు ధర ఉంది. డ్రాగన్ ఫ్రూట్ వినియోగం పెరగడంతో పంట ఎప్పటికప్పుడు విక్రయించుకోవడానికి వీలుంటుంది. ఇలాంటి పంటను సాగుచేయడం ఎంతో లాభదాయకంగా ఉందని రైతులు అంటున్నారు.

ప్రభుత్వం చేయూత..

డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు రాష్ట్రప్రభుత్వం చేయూతనిస్తుంది. పంటను సాగు చేసే రైతులకు హెక్టార్‌కు రూ.30 వేల చొప్పున ప్రభుత్వం సబ్సిడీ అందచేస్తుంది. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా కూడా డ్రాగన్ ఫ్రూట్‌సాగును ప్రోత్సహిస్తుంది. జాబ్‌కార్డు కలిగి ఐదు ఎకరాల లోపు భూమిఉన్న సన్న, చిన్నకారు రైతులు అర్హులు. ఉపాధి హామీ పథకం నిధులతో నూరుశాతం సబ్సిడీపై ఈ పంటను సాగుచేసుకునే అవకాశం కూడా ఉంది. దీంతో పంటను సాగు చేసేందుకు ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

రైతులకు మంచి ఆదాయాన్ని ఇచ్చే పంట..



ఈ పంట అన్ని నేలల్లో సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఆసక్తి కలిగిన రైతులకు పంటపై అవగాహన కల్పిస్తాం. ఈఫ్రూట్ గుండెజబ్బులు, క్యాన్సర్, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఎంతగానో దోహదపడుతుంది. దీంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

– ఎస్.దీప్తి, ఉద్యానశాఖ అధికారిణి, అద్దంకి

పంట ఆదాయం బాగుంది..



నేను రెండు ఎకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్నాను. మొదట్లో ఎకరాకు ఐదు లక్షల వరకు ఖర్చు అయ్యింది. ఒక ఎకరాలో ప్రస్తుతం పంట చేతికి రావడం మొదలయ్యింది. పొలం దగ్గరకు వచ్చి కిలో రూ.200 చొప్పున ఫ్రూట్ కొనుక్కొని వెళ్తున్నారు. పంటను నిత్యం కనిపెట్టుకొని ఉంటే దిగుబడి ఆదాయం బాగానే ఉంటుంది.

– పల్లెర్ల నరసింహారెడ్డి, కొరిశపాడు గ్రామం

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

● నియోజవర్గ ఇన్‌చార్జి ఆమంచి



ఆమంచిని అభినందిస్తున్న మార్టూరు నాయకులు

కారంచేడు: మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ రాష్ట్ర సీఎంగా చేయడమే మనందరి లక్ష్యమని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ కార్యకర్తలనుద్దేశించి అన్నారు. శనివారం ఆయన వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లి తన స్వగృహంలో కార్యకర్తలతో మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ ప్రకటించిన రోజు నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆయనను కలసి అభినందనలు తెలుపుతున్నారు. పర్చూరు ఏఎంసీ మాజీ చైర్మన్ జువ్వా శివరామప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని కుంకలమర్రు గ్రామ సర్పంచ్ ఈదర సౌందర్య, గ్రామ సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కారంచేడు తహసీల్దార్ పీ సుశీలాదేవి ఆధ్వర్యంలో ఆర్ఐ అరుణ, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది ఆమంచిని కలసి శుభాకాంక్షలు తెలిపారు.

మార్టూరు: ఆమంచి కృష్ణమోహన్‌ను మార్టూరు సీఐ ఫిరోజ్ ఆయన స్వగృహంలో కలిశారు. బీసీ సెల్ అధ్యక్షుడు అడకా గంగయ్య యాదవ్, గర్నెపూడి రవి చంద్, పెనుబోయిన శ్రీనివాసరావు, కొండలు, కాకోలు పుల్లారావు తదితర నాయకులు కలిసిన వారిలో ఉన్నారు.

పర్చూరు: మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్‌ను అద్దంకి నాంచారమ్మ ఆలయ చైర్మన్ ఒగ్గిశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు లంకా శివ, రావువారి ప్రసాద్, మహారెడ్డి రాము, శ్రీకాంత్, రావువారి శ్రీనివాసరావు, జెట్టిచంద్రం, బెనర్జీ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చినగంజాం: పర్చూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్‌ను మున్నం వారిపాలెం పంచాయతీ ఉప సర్పంచ్ బేతాళ మునిరత్నం, కిషోర్, యలమంద, డేవిడ్ రాజు, మోషే, శ్రీనివాసరావు, పెదగంజాం గ్రామానికి చెందిన మున్నం నాగేశ్వర రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎం శ్రీరామ్మూర్తి రెడ్డి, కోమట్ల వెంకారెడ్డి, కోమట్ల శివారెడ్డి, కోమట్ల చిన్ననాగేశ్వరరెడ్డి తదితరులు ఆయనను కలిసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యం

కారంచేడు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం అనేక ఉపాధి పథకాలను ప్రభుత్వం ప్రవేశపెడుతోందని జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆమె మండల కేంద్రం కారంచేడులో డాక్టర్ వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె లబ్ధిదారులతో మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి మహిళ జగనన్న ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెరటికోళ్ల పథకం ద్వారా ఒక్కో యూనిట్‌ను కేవలం రూ.4800లకే 12 కోళ్లతో అందిస్తున్నామన్నారు. వీటిలో 8 పెట్టలు, 3 పుంజులుంటాయన్నారు. బయట మార్కెట్ విలువతో పోల్చుకుంటే చాలా తక్కువ ధరలకే ప్రభుత్వం అందిస్తుందన్నారు. మండలంలో 100 మందికి 100 యూనిట్‌లను ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మండల కన్వీనర్ దండా చౌదరిబాబు, ఎంపీడీవో రమేష్‌బాబు, ఏపీఎం మధుసూదనరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, గర్నెపూడి చిట్టెమ్మ, అశోక్, వేణు, జెన్నెమ్మ, కార్యాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని అందించాలి..

పర్చూరు: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని డీఆర్‌డీఏ పీడీ బి.అర్జునరావు అన్నారు. శనివారం పర్చూరులో పెరటికోళ్లకు సంబంధించి 100 యూనిట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పెరటి కోళ్ళు ఒక యూనిట్ ధర రూ.4800 ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ అంబేడ్కర్, ఏపీఎం లాజరు, సీసీలు, మహిళా సంఘం సభ్యులు స్వప్న, అరుణ తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: ఇంకొల్లు మండల కేంద్రంలో వైఎస్సార్ కేపీ ఆధ్వర్యంలో మహిళా గ్రూపులకు కోళ్లయూనిట్లను పశుసంవర్ధక శాఖ ఏడీ వెంగళరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బండారు ప్రభాకరరావు, ఎంపీటీసీలు ఆయేషాబుడే, రావి పేరయ్య, వైస్ ఎంపీపీ తూమాటి చలమయ్య, కో ఆప్షన్ సభ్యుడు సుభాని, ఏపీఎం కరుణాకరరావు, సీసీలు విజయకుమార్, అంజిరెడ్డి యానిమేటర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ముందస్తు సంక్రాంతి సంబరాలు



భోగి మంటలు వేస్తున్న సిబ్బంది

యద్దనపూడి: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆయా కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అందరూ ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గుల పోటీలు, భోగిమంటలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సిబ్బందికి కబడ్డీ, క్రికెట్, టెన్నిస్, వాలీబాల్, క్యారమ్స్ వంటి ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పులగం రజనీ, సర్పంచ్ వల్లేరు రేణుక, ఎంపీడీవో కృష్ణకుమారి, తహసీల్దారు వెంకటరెడ్డి, ఎస్సై రత్నకుమారి, వైద్యాధికారి సుభాషిణి, ఏపీఎం వెంకట్రావు, ఏపీవో రమేష్‌బాబు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా స్వామిత్వా సర్వే

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాల్లోని నివాస గృహాలు స్థలాలను గుర్తించి గుర్తింపు కార్డును అందించేందుకు చేస్తున్న స్వామిత్వా సర్వేను పకడ్బందీగా చేయాలని ఈవోఆర్డీ సీతామహాలక్ష్మి కోరారు. శనివారం చెన్నుపల్లి, కొప్పరపాలెం, అంబడిపూడి గ్రామాల్లో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

చీరాల: ద్విచక్రవాహన దారులు హెల్మెట్ ధరిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని ఒన్‌టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు అన్నారు. శనివారం పట్టణంలోని కూడళ్లలో ఆయన పోలీస్ సిబ్బందితో వాహనదారులకు ప్లకార్డులతో అవగాహన కల్పించారు.

చినగంజాం: తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించి తమ ప్రాణాలను నష్టపోకుండా కాపాడుకోవాలని ఇంకొల్లు ఎస్సై ఎస్కే నాయబ్ రసూల్ సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రం ఇంకొల్లులో ప్రజలకు హెల్మెట్ వలన కలిగే ప్రయోజనాలను గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కుముదిని

పర్చూరు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.కుముదిని అన్నారు. శనివారం పర్చూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్నంబొట్లవారిపాలెం, గర్నెపూడి గ్రామ సచివాలయాల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రాంసరీ నోట్లు, న్యాయ సేవాధికార సంస్థల చట్టం, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం, గర్భస్థ శిశువు లింగనిర్ధారణ పరీక్ష నిషేధ చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనంతమ్మ, మహిళా పోలీస్ సుధారాణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

అద్దంకి రూరల్: ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దండువీరయ్య పిలుపు మేరకు గత నెల 20 నుంచి 30వ తేదీ వరకు అన్ని కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపడుతున్న ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి తిరువీధి బాబూరావు మాదిగ కోరారు. శనివారం స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లాలో కార్యకర్తలతో జరిగిన సమావేశానికి అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు కందుకూరి కృపారావు అధ్యక్షత వహించారు.

ప్రతి ఇంటి సంక్షేమమే జగనన్న ధ్యేయం

● శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య



కెవీపాలెంలో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న కృష్ణచైతన్య

బల్లికురవ: పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించటమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శనివారం రాత్రి మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. సచివాలయంలోని వివిధ శాఖలు, వలంటీర్ల పనిపనితీరు ఎలా ఉందని లబ్ధిదారులను అడగటంతో సక్రమంగానే అందతున్నాయని సమాధానం చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని చంద్రబాబు ఆయన దత్తపుత్రుడు అవాకులు చవాకులు. పేలుతున్నారని విమర్శించారు. ఇరుకు రోడ్లలో బహిరంగ సభలు రోడ్ షోలు పెడుతూ ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటుంటే ప్రభుత్వం జీవో నెంబర్ 1 తెచ్చిందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలో కూడా విజయ ఢంకాతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం కావటం ఖాయమని చైతన్య అన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, జెడ్పీటీసీ చింతల అంజలి శ్రీనివాస్, సర్పంచ్ యాగ్ర శాంతమ్మ, సొసైటీ అధ్యక్షుడు దర్శి రామకృష్ణారావు నేతలు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

జే.పంగులూరు: మండలంలోని స్థానిక పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఈ నెల 13 నుంచి పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ. 30,116 రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, రెండో బహుమతి రూ. 20,116 ముప్పా నరేంద్రబాబు (అపర్ణ పౌల్ట్రీ ఫామ్), మూడో బహుమతి రూ. 15,116 పంగులూరు గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం రామారావు, నాల్గో బహుమతి రూ. 10,116 లు రావూరి రంగారావు, సొసైటీ అధ్యక్షుడు అందిస్తున్నారు. 63017 47101 నంబర్‌లో సంప్రదించాలని కమిటీ కోరింది.

14న పర్చూరులో ముగ్గుల పోటీలు..

పర్చూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీన పర్చూరులో జిల్లాస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు నర్రా లక్ష్మీసుధా ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు ఉంటాయన్నారు. పోటీల్లో గెలిచినవారికి మొదటి బహుమతి కింద రూ.7 వేలు రెండో బహుమతి రూ.5 వేలు మూడో బహుమతి రూ.3 వేలతో పాటు స్పెషల్ ప్రైజ్ కూడా ఉందని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఈ నెల 10 వ తేదీ లోపల తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 85559 88339, 96526 52632 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డబ్బు పంపకాల్లో తేడా వచ్చి పరస్పరం దాడి..

మార్టూరు: ఆన్‌లైన్ గేమ్‌లో వచ్చిన డబ్బు పంపకాల్లో తేడా వచ్చి ఒకరికొకరు దాడి చేసుకున్నారు. ఈఘటన మండలంలోని కొణిదెన రోడ్డులోని వైన్ షాప్ వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బల్లికురవ మండలం, కొణిదెన గ్రామానికి చెందిన పఠాన్ షరీఫ్, షేక్ మస్తాన్ వలీ ఇద్దరు స్నేహితులు. వీరిద్దరూ ఆన్‌లైన్ గేమ్ ఆడుతూ వచ్చిన డబ్బుతో మద్యానికి అలవాటు పడ్డారు. ఈక్రమంలో రాత్రి స్థానిక వైన్‌షాప్ వద్ద మద్యం మత్తులో డబ్బు పంపకాల విషయంలో గొడవపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వీరిలో తీవ్రంగా గాయపడిన షరీఫ్‌ను గుంటూరుకు, మస్తాన్ వలీని ఒంగోలుకు తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.